వారపు సంత కిటకిట

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: దసరా పండుగను పురస్కరించుకొనేందుకు శనివారం మండలకేంద్రం లో జరిగిన వారపు సంత కిటకిటలాడింది. దసరా పండుగను పురస్కరించి 23 పంచాయతీల ప్రజలు మేకలు, గొర్రెలు, నాటు కోళ్లు వారపు సంతకు తీసుకుని వచ్చారు.ప్రతి ఏడాది దసరా పండుగను పురస్కరించుకొని మైదాన ప్రాంతాలైన చోడవరం, పెందుర్తి, ఘాట్ రోడ్డు, గాజువాక, అనకాపల్లి ,పాడేరు తదితర ప్రాంతాల నుండి గొర్రెలు, మేకల కొనుగోలుకు వస్తుంటారు. ఒక్కొక్క మేక, గొర్రె రూ.15వేల నుంచి 20వేల వరకు ధర పలికింది. ఒక్కొక్క కోడి పుంజు సైజును బట్టి రూ.1500 నుంచి 2000 వరకు ధర పలకడంతో కొనుగోలు దారులు ఎగబడి మరీ కొనుగోలు చేశారు.వస్త్ర, కిరాణా షాపులు, పూజా సామాగ్రి సైతం ప్రజలు ఎగబడి కొనుగోలు చేయడంతో దసరా పండగ ముందుగానే వచ్చినట్లయ్యింది.

సంతలో గొర్రెలు

గిరిజన సమస్యల పరిష్కారంలో సర్కారు విఫలం

-సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

- 15న ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపు

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన సమస్యల పరిష్కారంలో సర్కారు విఫలమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం విమర్శించారు. నవంబరు 15న విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.పాడేరులో శనివారం సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో గిరిజన ప్రాంత సమస్యలు పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందిందని, కాఫీ రైతుల బకాయిలు, ఉపాధి హామీ, రోడ్డు, రవాణా సౌకర్యాలు లేక ఇప్పటికీ గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రచారం తప్ప గిరిజనులకు వైద్యం అందలేదన్నారు. గిరిజన అభివృద్ధి కుంటుపడిందని దుయ్య బట్టారు. రాష్ట్రానికి ఎంతో ద్రోహం చేసిన బీజేపీకి టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీలు వంత పాడటం మానేసి రాష్ట్రం హక్కుల కోసం బీజేపీని నిలదీయాలని, లేకపోతే ఆంధ్ర రాష్ట్ర ప్రజలు తిరగబడతారని, వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ప్రజలు ఒడిస్తారని అన్నారు. అక్టోబరు 30న గిరిజన ప్రాంతాలను కలుపుతూ బయలుదేరే జాతా సీతంపేటలో ప్రారంభమవుతుందని తెలిపారు. అదే రోజున కర్నూలు జిల్లా ఆదోనిలో మరోజాతా రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం, పల్నాడు తదితర వెనుకబడిన ప్రాంతాలను కలుపుతూ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నవంబరు 2న ఉత్తరాంధ్ర పారిశ్రామిక ప్రాంతాలను కలుపుతూ 3వ జాతా శ్రీకాకుళం జిల్లా మందసలో ప్రారంభమవుతుందని వివరించారు. ఈ మూడు జాతాల ముగింపు సందర్భంగా నవంబరు 15న విజయవాడలో బసవపున్నయ్య స్టేడియంలో భారీ బహిరంగ సభ జరగనుందని వివరించారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం జరిగే ప్రజా రక్షణ భేరి జాతాలు, బహిరంగ సభకు ప్రజలు పెద్దయెత్తున తరలి రావాలని కోరారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ, పోలీసు శాఖలో 36.53 కోట్ల అవినీతి అధికారులకు, రాజకీయ నాయకులకు మధ్య అనుబంధాన్ని బహిర్గతం చేస్తోందని, ఈ అవినీతిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చలానాల పేరుతో ఆటో డ్రైవర్లు, వాహన వినియోగదార్ల ముక్కుపిండి, వేదింపులకు గురిచేసి వసూలు చేసిన మొత్తం అవినీతిపాలు కావడం గర్హనీయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా చలానా వేదింపులు ఆపాలన్నారు.గత ప్రభుత్వ హయాంలోనే గరిష్టంగా 2 కోట్లు విలువైన టెండరును ఒక్క రూపాయికే ఆ కంపెనీ టెండరు దాఖలు చేయడం, దానిని పోలీసు శాఖ నమ్మడం, వైసిపి ప్రభుత్వం ఆ కాంట్రాక్టుకు కొనసాగించడం విస్మయపరుస్తోందన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

2018 నుండి ఇప్పటి వరకు చలానాల ద్వారా వసూలైన సొమ్ము వేరే ఖాతాల్లోకి మళ్ళినా గుర్తించలేక పోవడం, ఆడిట్ నిర్వహణ లోపం ఉందని పోలీసు శాఖ ప్రకటించడం, అవినీతి దృష్టికి వచ్చినా వెంటనే స్పందించకపోవడం బాధ్యతారాహిత్య మేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దోషులపై వెంటనే చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, నాయకులు బోనంగి చిన్నయ్య పడాల్, పోతురాజు, సుందర్ రావు, లక్కు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం, అడ్డతీగల

ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం వై రామవరం మండలం చవిటిదిబ్బ వాడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, పందిరి మామిడి నుండి చవిటిదెబ్బలు ఆర్ అండ్ బి రోడ్డును ప్రాజెక్ట్ అధికారి ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు. ముందుగా చవిటిదిబ్బలు, వాడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన గర్భిణీ స్త్రీలకు రక్తహీనత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జ్వరాలతో వచ్చిన రోగులకు వెంటనే రక్త నమోనాలు స్వీకరించి ఆయా వ్యాధులకు మందులు అందజేయాలని సూచించారు. ఏజెన్సీలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. పందిరి మామిడి నుండి చవిటి దిబ్బలు రోడ్డుకు ఇరువైపులా వెడల్పు చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని, రహదారుల నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీర్లను పిఒ ఆదేశించారు. ప్రాజెక్ట్ అధికారి వెంట రోడ్లు భవనాల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సాయి సతీష్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టూరిజం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- జెడ్‌పిటిసి గంగరాజు - బొర్రా గుహల వద్ద నిరసన

ప్రజాశక్తి-అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రాల యూనిట్లలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, .డైలీవేజ్. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జెడ్‌పిటిసి దీసరి. గంగరాజు డిమాండ్ చేశారు. కార్మికులు చేపట్టనున్న సమ్మెను మద్దతుగా శనివారం ప్రముఖ ప్రర్యాటక కేంద్రమైన బొర్రా గుహల ముఖద్వారం వద్ద నిరసన చేపట్టారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే సమ్మెబాట తప్పదని పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గంగరాజు మాట్లాడుతూ, పర్యాటకశాఖ ఉన్నతాధికారులు, కార్మిక యూనిన్‌లతో 2010 సంవత్సరంలో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం సమస్యలు పరిష్కరించాలన్నారు. నేటికీ ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఆ దిశగా ప్రర్యాటకశాఖ యాజమాన్యం పరిష్కరించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మిక సమస్యలు పరిష్కరించే వరకు మద్దతు తెలపడమే కాకుండా ఉమ్మడి జిల్లా పరిషత్ ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలలో ప్రస్తావించి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.సమ్మె బాట చేపడుతున్నట్లు సంబంధిత యాజమాన్యం, ఉన్నత అధికారులకు కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ పట్టించుకున్న దాఖలు లేవని విమర్శించారు. కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూరుస్తున్నప్పటికీ కార్మికుల సమస్యలు ఎందుకు పరిష్కరించ లేదని ఆయన ప్రశ్నించారు. చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ ముందుకు సాగ లేదన్నారు. అనంతరం బొర్రా పంచాయతీ సర్పంచ్ జన్ని. అప్పారావు, టోకురు. సర్పంచ్ కిల్లో మొస్య, అనంతగిరి సర్పంచ్ సోమ్మెల రూతులు కార్మికులకు మద్దతు తెలుపుతూ, ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పర్యాటక శాఖల నుండి పంచాయతీ లకు రావలసిన వాటా చెల్లించ లేదని వెంటనే పంచాయతీ వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు చేపట్టే సమ్మెకు తాము పూర్తి మద్దతు ప్రకటిస్తామని వారు స్పష్టం చేశారు. తక్షణమే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమార్, మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, కార్మిక యూనియన్ జిల్లా నాయకులు నరసింహారాజు, మండల కార్మిక ప్రతినిధులు బుద్ద రాజు, సోమేష్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

చెత్తా చెదారం కాల్చివేత

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -పెదబయలు రూరల్: మండల కేంద్రంలో చెత్తను తొలగించరూ పేరుతో ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందన లబించింది. సోమవారం జరిగే వారపు సంతలో చెత్తా చెదారం పేరుకు పోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించిన అధికార్లు చెత్త ను కాల్చి వేశారు, దీంతో సమీప ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

కాల్చి వేస్తున్న చెత్తా చెదారం

వాలీవాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి తదితరులు

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్ పురం

మండలంలోని కుంజవారి గూడెం గ్రామంలో కొమరం భీమ్ యూత్ ఆధ్వర్యంలో నాలుగు మండలాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎంపీపీ కారం లక్ష్మి, ఏఎస్‌డిఎస్ సంస్థ ముఖ్య అధిపతి వి.గాంధీబాబు, సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సరదాగా వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు, శారీరక దారుఢ్యం పెంపొందుతుందని తెలిపారు. గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఇటువంటి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించే వారికి బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. యువత క్రీడల్లో రాణించి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన భాధ్యత తల్లిదండ్రులకు వుందన్నారు వాలీబాల్ పోటీలో నాలుగు మండలాల నుండి40 టీములు పాల్గొంటున్నాయని, క్రీడలు రెండు రోజులు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి రూ.15వేలు, మూడో బహుమతి రూ.10వేలు అందిస్తున్నట్లు తెలిపారు. గెలుపు ఓటమి సహజమేనని గెలిపిన వారికి బహుమతులు ఉంటాయని ఎంపిపి తెలిపారు. ఈ కార్యక్రమంలో రవ్వ సుజాత, మాజీ ఎంపీటీసీ అజ్జమ్మ, క్రీడాకారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కరపత్రాలు ఇస్తున్న టిడిపి నేతలు

చంద్రబాబు అరెస్టు కక్ష పూరితం

ప్రజాశక్తి-చింతపల్లి: శిక్షణతో యువతకు బంగారు భవిష్యత్తును అందించిన తెదేపా జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడును వైకాపా ప్రభుత్వం కక్షపూరితంగా అరెస్టు చేసి ఇబ్బంది పెడుతుందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి జిసిసి మాజీ చైర్మన్ ఎం వి వి ప్రసాద్ అన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ మండలంలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కిముడు లక్ష్మయ్య ఆధ్వర్యంలో కిటుముల పంచాయతీ పలడ గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన పలడ గ్రామంలో మాట్లాడుతూ,చంద్రబాబు బయట ఉంటే రాబోవు ఎన్నికలలో వైకాపాకు ఓటమి తప్పదని గ్రహించి కుట్ర పూరితంగా ఆయనపై కేసులు బనాయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బేరా సత్యనారాయణ, పార్టీ నాయకులు పొత్తూరు రాంబాబు, లింగమూర్తి, బంగారయ్య, చిన్నాలు దొర, వనము శాంతి, సంజీవరావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీను

సమస్యలు పరిష్కరించాలని..

మాతృభాష వాలంటీర్ల వినతి

ప్రజాశక్తి-చింతపల్లి: తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని మాతృభాష వాలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాంగి శ్రీను డిమాండ్ చేశారు. మాభాష వాలంటీర్లు శుక్రవారం చింతపల్లిలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమంలో అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్, అదేవిధంగా వైకాపా ఉమ్మడి విశాఖ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ వై వి సుబ్బారెడ్డి, డీఈవో, ఎంఈఓ లకు వినతి పత్రాలు సమర్పించారు. మాతృభాష విద్యా వాలంటీర్లకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. స్థానిక బాష కలిగిన చోట నూతనంగా ఆ మాతృభాష విద్యా వాలంటీర్లను నియమించాలని, పాఠశాలలు తెరిచిన నాటి నుంచే తమను విధులలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాతృభాష విద్యా వాలంటీర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, మండల అధ్యక్షుడు ఎం బాబ్జి, ఉపాధ్యక్షుడు కే చిరంజీవి, కార్యదర్శి డి రాజబాబు, కోశాధికారి జి. మహేష్, సంతోష్, జి. బాస్, లింగు బాబు, లక్ష్మి, ఝాన్సీ, రమ, వీర్రాజు, కే. బాలరాజు, శంకర్రావు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి-చింతూరు

ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. చింతూరు డివిజన్‌లోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ వర్కర్స్ సమావేశం యూనియన్ నాయకులు సోడి దుర్గారావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఇందులో పాల్గొన్న వెంకట్ మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన వైఎస్.జగన్ నాలుగున్నరేళ్లు గడిచినా ఇంతవరకు ఆ హామీని అమలు చేయలేదన్నారు. వర్కర్లు చనిపోతే కనీసం ఎక్స్‌గ్రేసియా కూడా చెల్లించడం లేదన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికులకు 119, 25 ఎక్స్‌గ్రేసియా జీవోలు ఉన్నా వాటిని ఐటిడిఏ అధికారులు అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. చింతూరు డివిజన్లో 11 మంది వర్కర్లు చనిపోగా ఒక్క రూపాయి కూడా వారి కుటుంబాలకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎక్స్‌గ్రేసియా జీవోలు అమలు చేయాలని, హెచ్ఆర్ఏ, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, యూనిఫారం పంపిణీ చేయాలని, విద్యార్థుల సంఖ్య కనుగుణంగా వర్కర్ల పోస్టులను భర్తీ చేసి పని భారాన్ని తగ్గించాలని, రక్షణ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సిఐటియు జిల్లా నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ పోరాటాల ద్వారానే జీతాలు పెంపు, ఇతర సమస్యలను పరిష్కరించుకోగలమని, గత చరిత్ర అదే చెబుతుందని తెలిపారు. వైసిపి ప్రభుత్వంపై భ్రమలతో నాలుగున్నరేళ్ల పాటు పోరాటాలకు దూరంగా ఉండి ఏమీ సాధించలేకపోయారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఔట్ సోర్సింగ్ కార్మికులందరూ ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చంద్రమ్మ, రాజమణి, వీరయ్య, తిరుపతమ్మ, రమణమ్మ, సీతమ్మ, వీరస్వామి, రాంబాబు, బాబురావు, చంద్రయ్య, నాంచారమ్మ, సత్యవతి, శాంతమ్మ, రాములమ్మ, సీతమ్మ, ముత్తమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

ప్రజాశక్తి -కొయ్యూరు

మండలంలోని మంప పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి బడుగు రమేష్‌బాబు శనివారం సందర్శించారు. ఈ శిబిరంలో 389పైగా ఓపి నమోదు కాగా, వైద్యులు గుండె, పిల్లలు, కంటి, స్త్రీలకు సంబంధించిన వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి గ్రామంలోనే మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఇంగువ త్రినాథ్ మూర్తి పడాల్, వైసిపి మండలం అధ్యక్షులు జల్లి బాబులు, జెసిఎస్ కన్వీనర్ సుధాకర్, సీనియర్ నాయకులు గాడి సత్యనారాయణ, కన్వీనర్ పొలోజు సత్తిబాబు, అరిమేల కొండబాబు, పుష్ప, ఆగురు రాంబాబు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట : మండలంలోని గూడ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్షను జడ్పీటీసీ రేగం మత్స్యలింగం, ఎంపీపీ కూడా రాజబాబు ప్రారంభించారు. అనంతరం జడ్పీటీసీ మాట్లాడుతూ,ప్రతి పేదవాని ఆరోగ్యానికి రక్ష అన్నారు. ఈ పథకం ద్వారా వైద్యానికి అయ్యే ఖర్చు ప్రభుత్వం భరిస్తుందన్నారు. ప్రతి పేదవాడు దీన్ని ఉపయోగించుకోవాలన్నారు.ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఒంటబు ప్రియాంక, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు వంటుబు శామ్యూల్, స్థానిక సర్పంచ్ కంబిడి సరోజ, మీడియా కన్వీనర్ కొండకించెంగి కోటిబాబు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని బాలమణి దేవి, సీతమ్మ, జ్ఞానప్రకాష్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ప్రహరీ మంజూరుకు వినతి

ప్రజాశక్తి - చింతపల్లి

ముస్లింల శ్మశాన వాటిక (కబరస్తాన్) రక్షణకై ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను ముస్లిం లు కోరారు. శుక్రవారం చింతపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమంలో ముస్లింలు తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు శనివారం మాట్లాడుతూ, శ్మశాన వాటిక (కభరస్థాన్) కు ప్రహరీ లేకపోవడంతో ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రహరీ నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ మీరా, హజరత్ ఇమామ్ వల్లి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగూర్ బాబు, మండల కో ఆప్షన్ సభ్యుడు నాజర్ వల్లి, అహ్మద్ దర్గా, సత్తార్, వల్లి, రఫీ, మజీద్ కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ముస్లిములు

దుర్గాదేవి సారె ఊరేగింపు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ ఏనుగులు గ్రామంలో శనివారం దుర్గాదేవి అమ్మవారి సారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. భారీ ఎత్తున భవానీలు ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే దారకొండ తోట, నగరం డబ్బా కోట భక్తులు స్వామివారి ఊరేగింపులో పాల్గొన్నారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి- కొయ్యూరు

కొయ్యూరు కొండపై వెలసిన కనకదుర్గమ్మ వారి సన్నిధిలో ఏడవ రోజు శరన్నవరాత్రుల సందర్భంగా టిడిపి సీనియర్ కార్యకర్త అనిశెట్టి సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి కుమారులు అనిశెట్టి వీర వెంకట సత్యనారాయణ, అనిశెట్టి చిరంజీవి ఆధ్వర్యంలో శనివారం అన్న సమారధాన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాలు స్వీకరించారు.

పోలీస్ అమరుల త్యాగాలు చిరస్మరణీయం

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: విధి నిర్వహణలో అమరులైన పోలీస్ వీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కొనియాడారు. జిల్లా కేంద్రం పాడేరులోని తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీసులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లాకలెక్టర్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఈ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, అల్లూరి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ,పాడేరు, చింతపల్లి ఏఎస్పీలు ధీరజ్ ప్రతాప్, శివ కిషోర్ పలువురు డిఎస్పీలు, సర్కిల్ ఇన్స్పెక్టర్ సబ్ ఇన్స్పెక్టర్లు పుష్పగుచ్ఛాలతో పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా రక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. ప్రజల ధన మాన ప్రాణాలను పరిరక్షించడంలో పోలీసులు నిరంతరం అందించే సేవలు ఎంతో త్యాగపూరితమైనవని అన్నారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం పోలీసుల అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు.

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సాహసోపేతంగా తమ విధి నిర్వహణ సాగించడం గొప్ప విషయమని అన్నారు. గిరిజన ప్రాంతంలో అసాంఘిక శక్తుల్ని ఎదుర్కొని పోలీస్ సిబ్బంది నిర్వర్తిస్తున్న విధులపై ఆయన ప్రశంసించారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను ఆయన కొనియాడారు. అనంతరం పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ ద్వారా అందించిన ఆర్థిక సహాయ సహకారాలను జిల్లా కలెక్టర్, ఎస్పీ అందజేశారు. అల్లూరి జిల్లా ఏజెన్సీలో వివిధ విభాగాలలో ఉత్తమ సేవలు అందిస్తూ విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ రవీంద్రకు అవార్డు

ముంచంగిపుట్టు: పోలీసు అమరవీరుల దినోత్స వాన్ని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో స్థానిక ఎస్ఐ కే.రవీంద్ర కు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చేతుల మీదుగా శనివారం ప్రశంస పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ కే రవీంద్ర మాట్లాడుతూ, గంజాయి నిర్మూలన తదితర కార్యక్రమాలలో మండల ప్రజలకు అవగాహన కల్పించి సేవలందించినందుకుగాను ప్రశంస పత్రం అందుకోవడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.

అవార్డు అందుకుంటున్న ఎస్ఐ రవీంద్ర

మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెం గ్రామంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మోతుగూడెం ఎస్ఐ గోపాలరావు, కానిస్టేబుళ్లు అమరవీరుల స్థూపానికి పూల మాలలు వేసి, మౌనం పాటించారు. అనంతరం విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. వై.రామవరం డొంకరాయి గ్రామంలో ఎస్ఐ శివ కుమార్ ఆధ్వర్యంలో విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎఫ్/42 సిఆర్‌పిఎఫ్ కంపెనీ పోలీసులు, స్టేషన్ సిబ్బంది పోలీసు అమరవీరులకు జోహార్లు అంటూ పోలీస్ స్టేషన్ నుండి సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డొంకరాయి గ్రామ సెంటర్లో పోలీసు అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివ కుమార్ మాట్లాడుతూ పగలు రాత్రి ఎండా వాన లెక్కచేయకుండా ఒక్క పోలీసులు మాత్రమే దేశ భద్రత కోసం, దేశ ప్రజల భద్రత కోసం, దేశాన్ని కాపాడటం కోసం ఎంతో మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్నారని, వారి పోరాట పటిమను గుర్తు చేసుకుని, వారిని స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కళ్యాణ్, కానిస్టేబుళ్లు శ్రీను, నరేష్, సుధాకర్, పోసియ్య, ఎఫ్ /42 సి.ఆర్.పి.ఎఫ్ కంపెనీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మోతుగూడెంలో...

వాలీబాల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- పెదబయలు: మావోయిస్టు ప్రభావితం ప్రాంతాలైన గున్నలోవ, గుదిగుంట, సుజారి, బోరికిపనస గ్రామాలలో స్థానిక ఎస్ఐ పులి మనోజ్ కుమార్ ఆధ్వర్యాన వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి పంటకు బదులుగా వాణిజ్య పంటలు పండించుకొని ఆర్థికంగా లాభపడాలన్నారు. మావోయిస్టులకు ఎవరు సహకరించ వద్దని హితవు పలికారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

అంబేద్కర్ ఐడియాలజీ ఇన్ ద డిజిటల్ ఎరా పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ రచించిన 'అంబేద్కర్ ఐడియాలజీ ఇన్ ది డిజిటల్ ఎరా' పుస్తకాన్ని శనివారం ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో ఆవిష్కరించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చైర్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్, ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి, క్రిష్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, ఏయూ పూర్వ పాలక మండలి సభ్యులు యేసుపాదం, ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, ప్రిన్సిపల్ ఆచార్య టి.శోభశ్రీ సంయుక్తంగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. అంబేద్కర్ ఆలోచనలు నేటి సాంకేతికతకు అనుసంధానంగా సామాజిక సమస్యలకు ఏ విధంగా పరిష్కారాలను చూపుతున్నాయనే అంశాలను ఈ పుస్తకంలో రచయిత ఎం.జేమ్స్ స్టీఫెన్ వివరించారు. మెత్తం పుస్తకాన్ని 20 చాప్టర్లుగా తీర్చిదిద్దామని, అంబేద్కర్ ఆలోచనలు, నేటి సాంకేతిక యుగంలో అంబేద్కర్ ప్రాధాన్యత, అంబేద్కర్ దృక్కోణంలో డిజిటల్ ఎరాలో సామాజిక న్యాయం, సమానత్వం, ఏక్సస్ టు ఇన్ఫర్మేషన్ అండ్ నాలెడ్జ్ ఇన్ ద డిజిటల్ ఏజ్- అంబేద్కర్ విజన్, డిజిటల్ ఏక్టివిజం అండ్ సోషల్ మూమెంట్స్- లెసన్స్ ఫ్రం అంబేద్కరైట్ మూమెంట్, సామాజిక మార్పుకు సోషల్ మీడియా దోహదపడుతున్న విధానం, డిజిటల్ ప్రైవసీ, డేటా ప్రొటక్షన్ అండ్ ఇట్స్ ఇంప్లికేషన్స్ ఫర్ మార్జినలైజ్డ్ గ్రూప్స్, ఏఐ అండ్ అల్గారిథమ్స్-ఇంప్లికేషన్స్ ఫర్ సోషల్ జస్టిస్, డిజిటల్ లిటరసీ అండ్ ఎడ్యుకేషన్-ఎంపవరింగ్ ద మార్జినలైజ్డ్ తదితర అంశాలను వివరించారు. పుస్తకంలో 20 చాప్టర్లను ఒక మూక్స్ కోర్సుగా తీసుకొచ్చే ఆలోచన ఉందని రచయిత ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలిపారు. ప్రస్తుతం పుస్తకాన్ని అమెజాన్ కిండిల్‌లో అందరికీ అందుబాటులో ఉంచామన్నారు. ఏయూ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాన్ని డిజిటల్ మాధ్యమంలో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. త్వరలో పుస్తకానికి ద్వితీయ సంచికను తీసుకురానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీన్‌లు ఆచార్య కె.బసవయ్య, జి.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ ఆలోచనలను ప్రస్తుత తరానికి చేరువ చేసే విధంగా వర్తమాన అంశాలపై పుస్తకాన్ని రచించిన ఆచార్య జేమ్స్ స్టీఫెన్‌ని అతిథులు అభినందించారు.

రిజిస్ట్రార్‌ను అభినందించిన జూపూడి

రిజిస్ట్రార్‌గా నియమితులైన ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌ను ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్ అభినందించారు. కార్యాలయంలో కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

విద్యుత్ భారాలపై నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణం తగ్గించాలని సిపిఎం సీనియర్ నాయకులు వై.రాజు డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలపై శనివారం జగదాంబ జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతుంటే.. అవి చాలవన్నట్టు విద్యుత్ ఛార్జీలు పెంచడం హేయమైన చర్యని అన్నారు. మోడీ సర్కారు ఆదేశంతో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలను అమలు జరపడం దారుణమన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్ మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచడం వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడి యువత ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. సిపిఎం జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచబోమని నాడు జగన్మోహన్ రెడ్డి చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి చంద్రమౌళి, హోటల్ యూనియన్ నాయకులు ఎర్రిబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నర్సింగరావు, ఎం.సూరీడు, మణి, సత్యవతి పాల్గొన్నారు.

వాలాబు గిరిజనులకు తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి - దేవరాపల్లి : వాలాబు పంచాయతీలోని గిరిజనులకు అన్నింటా తీవ్ర అన్యాయం జరుగుతోందని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. మండలంలోని సిఐటియు కార్యాలయం వద్ద గిరిజనులతో ఆయన సమావేశమయ్యారు. వారి కష్టాలను తెలుసుకున్నారు. అనంతరం వాలాబు రోడ్డు ముఖద్వారాన్ని పరిశీలించి, అనంతరం మాట్లాడారు. మాడుగుల నియోజకవర్గానికి చెందిన బూడి ముత్యాల నాయుడుకు ఉప ముఖ్యమంత్రి పదవి దక్కడం అభినందనీయమే అయినా, ప్రజల సమస్యలు పరిష్కారం చేయలేని పదవులు ఎందుకని ప్రశ్నించారు. వాలాబు పంచాయతీపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ అభివృద్ధికి దూరంగా ఉంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీలోని పద్నాలుగు గిరిజన గ్రామాలకుగాను సగం గ్రామాలకు కూడా లింకు రోడ్లు లేవన్నారు. ఉప ముఖ్యమంత్రి సొంత మండలంలోని పరిస్థితే ఇలా ఉంటే రాష్ట్రంలో పరిస్థితి ఏ విధంగా ఉందో ప్రజలు అర్థం చేసుకోవచ్చునన్నారు. శారదా నదిపై శాశ్వత బ్రిడ్జి ఏర్పాటు చేయాలని, పినకోటకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సిపిఎం ఎంతో కృషి చేసిందని, కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత పూర్తిగా విస్మరించిందని తెలిపారు. బ్రిడ్జికి రెండు వైపులా కనీసం అప్రోచ్ రోడ్డును కూడా పూర్తి చేయలేదన్నారు. ప్రజల నమ్మకాన్ని బూడి ముత్యాల నాయుడు వమ్ము చేశారని తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో వైసిపి సర్పంచ్ ఓడిపోయినంత మాత్రాన వాలాబు గిరిజనులు పట్ల వివక్షత చూపించడం సరైంది కాదని అన్నారు. తక్షణమే అన్ని సమస్యలనూ పరిష్కరించాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న మాట్లాడుతూ మండలంలో వందలాది మంది పేదలు అసైన్డ్ భూములను సాగుచేసుకుంటున్నారని, వారందరినీ గుర్తించి పట్టాలు ఇవ్వాలని కోరారు. చింతలపూడి పంచాయతీలో నేరేళ్లపూడి, వీరబద్రిపేట, బోడిగరువు గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్యాయం చేసేదిగా ఉందని, తక్షణం ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పైలా దేముడు బాబు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఐవి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎస్‌టియు ఆధ్వర్యంలో ఆక్రందన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు.

తగ్గిన ధాన్యం కొనుగోలు లక్ష్యం

50 వేల మెట్రిక్ టన్నులకే ప్రణాళిక
డిసెంబరు చివరి వారం నుంచిప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాల్లేకపోవడంతో భారీగా ధాన్యం దిగుబడులు తగ్గనున్నాయి. వర్షాల్లేక వరి పంట సాగు విస్తీర్ణం తగ్గడంతో పాటు వర్షాభావ పరిస్థితులు కొనసాగడంతో దిగుబడులు తగ్గుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. దీంతో ఈ ఏడాది ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసే ధాన్యం పరిమాణం తగ్గుతుందని పౌరసరఫరాల సంస్థ అధికారులు భావించి అంచనాలు రూపొందించారు. గతేడాది కంటే ఈ ఏడాది లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి తగ్గుతుందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. గతేడాది ఖరీఫ్‌లో 1,36,232 ఎకరాలకు 1,39,242 (102 శాతం) ఎకరాల్లో వరి పంట సాగవడంతో 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వుంటుందన్న అంచనాతో సొంత అవసరాలకు వుంచుకోనూ, 72 క్లస్టర్ల ద్వారా 87,661 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విధించిన నిబంధనలకు తోడు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావడానికి రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో అతి కష్టమ్మీద 33 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగలిగారు.

ఈ ఏడాది ఇలా..

జిల్లాలోని 24 మండలాల్లో ఈ ఏడాది 380 రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బికెలు)ను ఎ, బి, సి కేటగిరీలుగా విభజించి 72 క్లస్టర్లు కింద ఏర్పాటుచేశారు. వీటి ద్వారా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు ప్రాథమికంగా లక్ష్యం విధించుకున్నారు. ఈ ఖరీఫ్‌లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,36,460 ఎకరాలకు 1,10,765 (81 శాతం) ఎకరాల్లో సాగైంది. వర్షాల్లేక సాగు ఆలస్యం కావడం, తరువాత వర్షాల్లేకపోవడంతో 2.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వుంటుందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. వర్షాభావ పరిస్థితులు కొనసాగితే అంచనా కంటే దిగుబడులు తగ్గనున్నాయి. అందుకని గతేడాది కంటే ఈ ఏడాది కొనుగోలు చేయాల్సిన ధాన్యం లక్ష్యం 50 వేల మెట్రిక్ టన్నులకు తగ్గింది.

డిసెంబరు రెండో వారం నుంచి వరి కోతలు ప్రారంభమైతే నాలుగో వారం నుంచి కొనుగోలు ప్రారంభమవుతాయన్న అంచనాతో కొనుగోలు కేంద్రాలను పౌరసరఫరాల సంస్థ సిద్ధం చేస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో సిబ్బందిని నియమించింది. వీరికి నవంబరులో శిక్షణ ఇవ్వనుంది.

ఈ ఏడాది సాధారణ రకం ధాన్యం క్వింటా ధర రూ.2,183గా ప్రభుత్వం ప్రకటించింది. గతేడాది ఈ ధర రూ.2.040గా వుంది. గ్రేడ్-ఎ రకం ధాన్యం ధర ఈ ఏడాది క్వింటాకు రూ.2,203 వుండగా, గతేడాది రూ.2,060గా వుంది. కొనుగోలు చేసిన ధాన్యం సమీపంలోనున్న 23 రైస్ మిల్స్‌కు సరఫరా చేసే ఆలోచనతో అధికారులున్నారు. గతంలో వలె ఈసారి కూడా రైతు భరోసా కేంద్రాల్లో అమ్మకానికి ముందు ధాన్యం వివరాలను రైతులు నమోదుచేసుకోవాల్సివుంది. రైతు పంట తప్పనిసరిగా ఈ - క్రాప్‌లో నమోదై ఇకెవైసి కావాల్సివుంది. రైతులు తమ సమస్యలను తెలియజేసేందుకు కంట్రోల్‌రూమ్, ఫోన్ నెంబర్లను పౌరసరఫరాల సంస్థ అధికారులు ఏర్పాటుచేయనున్నారు.

వైద్య సేవల విస్తరణపై దృష్టి

కార్పొరేట్‌కు ధీటుగా రూ.21.92 కోట్లతో కెజిహెచ్‌లో అభివృద్ధి పనులు
రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పేద ప్రజల ఆరోగ్య భద్రత, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా వైద్య రంగంలో సంస్కరణలు చేపట్టామని, వైద్య సేవలను విస్తరించడంపై దృష్టి సారించామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. దానిలో భాగంగానే ఆధునిక వసతులతో కూడిన ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఫ్యామిలీ డాక్టర్ విధానం, జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అందుబాటులోకి వచ్చాయని గుర్తు చేశారు. ఆరోగ్య శ్రీ పథకంలో వెయ్యి వరకు ఉన్న సేవలను మూడు వేల వరకు పెంచామని చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పేద ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలందించేందుకుగాను విశాఖపట్నం కెజిహెచ్‌లో సుమారు రూ.21.92 కోట్లతో తలపెట్టిన పలు అభివృద్ధి పనులను ఆమె శనివారం ప్రారంభించారు.

తొలుత కార్డియాలజీ విభాగంలో రూ.24 లక్షల సిఎస్ఆర్ నిధులతో ఆధునికీకరించిన ఐసిసియు, ఎంసియు యూనిట్లను ప్రారంభించారు. అనంతరం కార్డియాలజీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులను పలకరించి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.11.25 కోట్లతో ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ, రూ.3.82 కోట్లతో ఏర్పాటు చేసిన సీటీ స్కానింగ్ యూనిట్లను, రూ.2.38 కోట్లతో సమకూర్చిన అధునాతన తొమ్మిది అంబులెన్స్‌లను ప్రారంభించారు. అక్కడ నుంచి స్కిల్ ల్యాబ్‌కు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన పరికరాలను మంత్రి పరిశీలించారు. రూ.1.50 కోట్లతో సమకూర్చిన పరికరాలను, స్కిల్ ల్యాబ్‌ను ప్రారంభించారు. చివరగా ఆంధ్ర వైద్య కళాశాల వద్ద వందేళ్ల వేడుకను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు.


కెజిహెచ్‌లో రోగులను పలకరిస్తున్న మంత్రి రజని

అనంతరం అధికారులు, వైద్యులతో కలిసి అక్కడ ఫొటో దిగారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో రూ.16 వేల కోట్లకుపైగా వైద్య రంగానికి కేటాయించామని తెలిపారు. 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను నిర్మించి, అందులో ఐదింటిని ఇటీవలే అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా 90 శాతం మందికి సేవలందిస్తున్నామని వెల్లడించారు. విమ్స్ ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు దాదాపు రూ.250 కోట్లు కేటాయించామని, భవిష్యత్తులో మరిన్ని చర్యలు చేపడతామని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

నేరాలు ఘోరాలు

రిమాండ్ ఖైదీ మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో రిమాండ్‌లో ఉన్న ఖైదీ కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జైలు పర్యవేక్షణాధికారి కిశోర్‌కుమార్ కథనం ప్రకారం... గంజాయి కేసులో ముద్దాయిగా కింతకోటకు చెందిన కె.నాగరాజు (32) ఈ ఏడాది మార్చిలో జైలుకు వచ్చాడు. అప్పటి నుంచి ఇక్కడ రిమాండు ఖైదీగా ఉంటున్నాడు. కారాగారానికి వచ్చినప్పటికీ ఆయన మద్యానికి బానిసై ఊపిరి తిత్తుల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. మూడు నెలలుగా జైల్లో ఆసుపత్రి వైద్యులతో పాటు కెజిహెచ్‌లో సైతం వైద్యం తీసుకుంటున్నాడు. నాగరాజు ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించడంతో ఈ నెల 7న కెజిహెచ్‌కి జైలు వార్డులో చికిత్సకోసం చేర్చి చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో నాగరాజు శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ విషయాన్ని నాగరాజు కుటుంబ సభ్యులకు జైలు సూపరింటెండెంట్ తెలియజేశారు.

కారు బోల్తా : డ్రైవర్ మృతి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు ఐఎన్ఎస్ కళింగ ఎదురుగా శుక్ర వారం అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... జివిఎంసి నాలుగో వార్డు నేరెళ్లవలసకు చెందిన ఊళ్ళ నరసింహరాజు (36), అదే గ్రామానికి చెందిన విఆర్ఒ కోరాడ కుమార్, డేటా ఎంట్రీ ఆపరేటర్ వారాడ లక్ష్మణ వర్మ, మల్కాపురం ప్రాంతానికి చెందిన మరో విఆర్ఒ బి.ప్రతాప్ వెంకటకుమార్ రెండో ఆట సినిమాకు వెళ్లి భీమిలి నుంచి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారు అతి వేగంగా వస్తూ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఊళ్ళ నరసింహరాజు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ముగ్గురు గాయాలతో విశాఖ నగరంలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల శివారులో ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలో శనివారం సాయంత్రం కోడూరు, మాడుగుల ప్రధాన రహదారిలో పిరమిడ్ కేంద్రం వద్ద ఈ ప్రమాదం జరిగింది. స్కూటీ వాహనంపై ముగ్గురు, మరో బైక్‌పై ఒకరు వెళుతుండగా ఢీకొవడంతో సులేమాన్ అనే వ్యక్తికి తలకు తీవ్రగాయం కావడంతో విశాఖపట్నం తరలించారు. మిగిలిన ముగ్గురిలో కిరణ్, కోటేశ్వరరావు, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని మాడుగుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సైకాలజీలో కాగ్నిటివ్ డిజిటల్ థెరపీ ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం సైకాలజీ విభాగంలో అధునాతన కాగ్నిటివ్ డిజిటల్ థెరఫీ కేంద్రాన్ని వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. కేంద్రం ప్రత్యేకతలను, ప్రజలకు, విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే విధానాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన రెస్ట్ రూమ్‌ను విద్యార్థినితో ప్రారంభింపజేశారు. అనంతరం విభాగాలో ప్రయోగశాలను తనిఖీ చేశారు. అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. తరగతి గదులు, సమావేశ మందిరం, ప్రయోగశాలలు ఆధునీకరించిన విధానాన్ని గమనించి, పలు సూచనలు చేశారు.

విభాగాధిపతి ఆచార్య ఎంవిఆర్.రాజు మాట్లాడుతూ, వ్యక్తిలో మానసిక సమస్యను, డిప్రెషన్, ఒత్తిడి స్థాయిలు, ఏంగ్జయిటీ, ఎమోషన్స్ వంటివి కాగ్నిటివ్ డిజిటల్ థెరఫీ సహాయంతో గుర్తించడం సాధ్యపడుతుందన్నారు. వీటితో పాటు విభాగంలో ఆల్కహాల్ ఎవర్షన్ థెరఫి (మద్యం మాన్పించే విధానం), న్యూరో ఫిజిలాజికల్ ల్యాబ్‌కు పనిచేస్తున్న విధానాలను వివరించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

కార్మికులు, ఉద్యోగుల హక్కు పెన్షన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పెన్షన్ ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదని, కార్మికులు, ఉద్యోగులు కలిసి పోరాడి సాధించుకున్న హక్కు అని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ డిఒటి పెన్షనర్స్ అసోసియేషన్ (ఎఐబిడిపిఎ) 15వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు వివి.రమణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం 'పెన్షనర్ల సమస్యలు - ప్రభుత్వ వైఖరి - మన కర్తవ్యం' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ పెన్షన్ అనేది లేకుండా చేయాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. ఆ చర్యను ఉద్యోగులంతా సంఘటితంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పెన్షన్ లేకుండా పోతుందని హెచ్చరించారు. సదస్సులో ఎఐబిడిపిఎ జిల్లా కార్యదర్శి కె.రామాంజనేయులు, అఖిలభారత ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎఎ.అష్రాఫ్, రిటైర్డ్ సిఎజి ఎపి సర్కిల్ అధ్యక్షులు పిఎల్.రాజు, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పిఇసిహెచ్‌వి.సాగర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.గోపాలకృష్ణ, కోశాధికారి ఆర్.సత్యనారాయణ మాట్లాడారు. సమావేశంలో నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరం, మింది, మధురవాడ, సింహాచలం తదితర ప్రాంతాల నుంచి పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 70-81 సంవత్సరాలు పైబడిన పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా నలుగురు పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు మాధవధారలో ఉన్న కేర్ అండ్ లవ్ సంస్థ మానసిక వికలాంగ పిల్లలకు టవల్స్ పంపిణీ చేశారు.

కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ జిల్లా తీర ప్రాంత గ్రామాలలో తరతరాల నుంచీ నివసిస్తున్న మత్స్యకారులు కమ్యూనిటీ హాల్ నిర్మించుకునేందుకు వెయ్యి చదరపు గజాల స్థలం కేటాయించాలని వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో - ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డికి ఆయన నివాసంలో శనివారం మత్స్యకారులు వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారులు చాలా వెనుకబడి ఉన్నారని, వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకార నాయుకులు కుక్కల నాగరాజు, కొమర అప్పలరాజు, భాస్కర్, దేశియ్య పాల్గొన్నారు.

యుజిడి కార్మికుల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : యుజిడి కార్మికులను జివిఎంసి డ్రైవర్లుగా వాడుకోవడం విరమించాలని డిమాండ్ చేస్తూ శనివారం అప్పుఘర్ ప్లాంట్ వద్ద యుజిడి కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుజిడి వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు ఇ.ఆదినారాయణ మాట్లాడుతూ జివిఎంసి అధికారులు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల పనిని, ప్రజల సేవను గాలికి వదిలేశారన్నారు. సొంత ప్రయోజనాలకు యుజిడి కార్మికులను వాడుకుంటున్నారన్నారు. దీనిపై జివిఎంసి కమిషనర్ చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. యుజిడి ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న ఎన్.సాయిని యుజిడి ప్లాంట్‌లో కాకుండా అధికారులు డ్రైవర్‌గా వాడుకోవటమేమిటని, అక్కడ పనులు ఎవరు చేస్తారని ప్రశ్నించారు. యుజిడిలో పనిచేసే కార్మికుల సంఖ్య ఇప్పటికే తక్కువగా ఉందన్నారు, కార్మికులకు ఇష్టంలేకపోయినా డ్రైవర్లుగా తీసుకువెళ్ళి పనిచేయించుకుంటున్నారన్నారు. రాకపోతే పని నుంచి ఆపుతామని, జీతాలు నిలుపుదల చేస్తామని కిందిస్థాయి అధికారులు బెదిరించి భయభ్రాంతులకు గురిచేయడం తగదన్నారు. కార్యక్రమంలో నరేష్, బద్రి, మహేష్, యేసు, అంజి, రమణ, రామలక్ష్మి, అప్పయ్యమ్మ, రత్నం పాల్గొన్నారు.